సాక్షి అనకాపల్లి

మంగళవారం । 21 । నవంబర్ । 2023



గడువులోగా పరిష్కారం

స్పందనలో వచ్చే అర్జీలు, ఫిర్యాదులను మరింత వేగంగా పరిష్కరించాలని జేసీ ఎం.జాహ్నవి ఆదేశించారు. 8లో



హార్బర్‌లో అలజడి

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదం తీవ్ర అలజడి రేపింది. 8లో

నాడు-నేడుతో ఆస్పత్రుల అభివృద్ధి..

మెరుగుపడ్డ వైద్య సేవలపై కథనం 9లో



న్యూస్‌రీల్

చురుగ్గా ప్రాధాన్యత భవన నిర్మాణ పనులు

పంచాయతీరాజ్ ఎస్ఈ వీరంనాయుడు



మాట్లాడుతున్న ఎస్ఈ వీరంనాయుడు

పాయకరావుపేట: జిల్లాలోని మండలాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయని, పంచాయతీ రాజ్ ఎస్ఈ వీరంనాయుడు తెలిపారు. మండలాల వారీగా అభివృద్ధి పనులపై పట్టణంలోని పంచాయతీరాజ్‌శాఖ అతిథి గృహంలో అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలోని 19 మండలాల పరిధిలో ఉన్న ఆర్బీకేలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయన్నారు. పాయకరావుపేట, నాతవరం, రోలుగుంట, బుచ్చియ్యపేట, రాంబిల్లి మండలాల్లో మాత్రం పనులు ఆశించినంత వేగంగా జరగట్లేదన్నారు. జిల్లాలో 442 గ్రామ సచివాలయాలకు గాను 320 భవనాలు, 362 ఆర్బీకేల్లో 196 భవనాలు, 321 వెల్‌నెస్ కేంద్రాలకు గాను 115 భవనాల నిర్మాణం పూర్తయిందన్నారు. మిగిలిన భవనాలు డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేసేందుకు ఆయా మండలాల వారీగా సమీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యకరమైన జీవితం

తుమ్మపాల: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం స్టాల్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు నుంచి నేరుగా వినియోగదారులకు ప్రకృతి సిద్ధంగా పండిన కూరగాయాలు, నూనెలు, బియ్యం అందించడంపై ఆనందం వ్యక్తం చేశారు. స్పందనకు వచ్చే అర్జీదారులు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బందికి రసాయనాల్లేని తాజా కూరగాయలు, ఆకుకూరలు, ప్రకృతి సాగు బెల్లం, నూనెలు, బియ్యాన్ని స్టాల్‌లో అందుబాటులో ఉంచినట్లు ప్రాజెక్ట్ మేనేజర్ లచ్చన్న తెలిపారు. ఇకపై ప్రతి సోమవారం ఈ స్టాల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, ఏపీడీ డైజీ, జిల్లా అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి చెరకు రైతుల క్షీరాభిషేకం



బుచ్చెయ్యపేట కాటా వద్ద సీఎం జగన్ చిత్రపటానికి పాలతో అభిషేకం

బుచ్చెయ్యపేట: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికుల బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం రూ.12.50 కోట్ల నిధులు మంజూరు చేయడంపై రైతు సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం బుచ్చెయ్యపేట చెరకు కాటా వద్ద పలు గ్రామాలకు చెందిన రైతు సంఘ నాయకులు, సుగర్ ఫ్యాక్టరీ సభ్య రైతులు, తూనిక కాటాల వద్ద పనిచేసే కార్మికులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలతో అభిషేకం చేసి, తమ కృతజ్ఞతలు తెలిపారు. రైతు ప్రభుత్వంగా, తమకు వెన్నుదన్నుగా ఉన్న సీఎం జగన్‌కు, నిధులు మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరీదేవి, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జోగా కొండబాబు, రైతు సంఘ నాయకులు సుంకరి గాంధీ, పెదిరెడ్ల బాషా, సీతా బుజ్జి, వెంకటరావు, గొంపా అప్పారావు, సన్యాసినాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

మెడికల్ కళాశాలకు శర్మ భౌతికకాయం

తగరపువలస: నగరంలోని ఎండాడకు చెందిన 86 ఏళ్ల విశ్రాంత ఇరిగేషన్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎస్.ఎన్.శర్మ భౌతికాయాన్ని అతని కుటుంబ సభ్యులు సోమవారం సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ సైన్సెస్‌కు అందించారు. అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు సీతామహలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం... తమ సంఘంలో సీనియర్ సభ్యుడైన శర్మ ఆదివారం రాత్రి ఎండాడలోని ఆయన కుమారుడు శ్రీనివాస్ ఇంట్లో మృతి చెందారన్నారు. ఆయన అంతిమ కోరిక మేరకు మెడికల్ కళాశాలకు భౌతికకాయాన్ని అందించామన్నారు.

జగన్ ప్రభుత్వం అంటే.. జనం ప్రభుత్వం. జగన్మోహనుడి పాలనలో పల్లె నుంచి పట్టణం వరకు అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు అధికారంలో అగ్రపీఠం దక్కింది. ప్రజాప్రతినిధుల్లో సగానికి మించి వారే. దీంతో ప్రతిపక్షాల ఆరోపణలు, అబద్ధాలకు పాతర వేస్తూ, ప్రభుత్వ పనితీరును మరింతగా **ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన 'సామాజిక సాధికార బస్సుయాత్ర'కు ఊరూవాడా బ్రహ్మరథం పట్టింది. జగన్ వెంటే.. జనం అంటూ నినదించింది.**





అచ్యుతాపురంలో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన జన సందోహంలో ఒక భాగం

సామాజిక జగన్నినాదం

- బస్సు యాత్రకు అడుగడుగునా బ్రహ్మరథం
- కిక్కిరిసిన యలమంచిలి-అచ్యుతాపురం రహదారి
- అతిథుల ప్రసంగాలకు మిన్నంటిన కరతాళ ధ్వనులు



సభలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, వేదికపై మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎమ్మెల్యే కన్నబాబురాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



యలమంచిలి బస్టాండ్ జంక్షన్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలతో నివాళి

అచ్యుతాపురం(అనకాపల్లి)/యలమంచిలి/రాంబిల్లి: సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు భారీగా తరలివచ్చారు. యలమంచిలి-అచ్యుతాపురం రహదారి పొడవునా వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాయి. జగన్నామస్మరణతో ఊరూవాడా మార్మోగాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పట్టాభిషేకం చేసిన ఈ ప్రభుత్వానికి తాము అండగా ఉంటామంటూ ఆయా వర్గాలకు చెందిన మహిళలు, యువత స్వచ్ఛందంగా ఎక్కడికక్కడ బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికారు.

మహానేతకు ఘననివాళి

యలమంచిలి స్టేషన్ రోడ్డులో ఉన్న దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి బస్సు యాత్రలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు, ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, యలమంచిలి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త రొంగలి జగన్నాథం, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, నవరత్నాల వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తిలు పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం యలమంచిలి నుంచి బస్సు యాత్ర బయలుదేరింది. రహదారులు కిక్కిరిసిపోయాయి.

యాత్ర సాగిందిలా..

యలమంచిలి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం అనంతరం ప్రారంభమైన బస్సు యాత్ర దిమిలి రోడ్డు, పెంకుల షెడ్ రోడ్డు, కాటా జంక్షన్ నుంచి నారాయణపురం, మామిడివాడ, కొత్తూరు జంక్షన్, పంచదార్ల, భోగాపురం, వెంకటాపురం, వెదురువాడ, మార్టూరు రోడ్డు మీదుగా అచ్యుతాపురం వరకు సాగింది. బస్సు యాత్ర వెంట కార్ల కాన్వాయ్, బైక్ ర్యాలీలు, నడిచి వచ్చే అభిమాన గణంతో సభా ప్రాంగణం కిటకిటలాడింది.

ఆకట్టుకున్న ప్రసంగాలు

సామాజిక సాధికార యాత్రలో పాల్గొన్న అతిథుల ప్రసంగాలు ప్రజల్ని ఆలోచింపజేశాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యం గురించి వక్తలు వివరించిన తీరు ఆకట్టుకుంది. మంత్రులు బూడి ముత్యాలనాయుడు, ధర్మాన ప్రసాదరావు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీలు అన్ని అంశాలపై కూలంకషంగా మాట్లాడారు. సభ ప్రారంభానికి ముందు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాష్ట్ర సాంస్కృతిక మండలి చైర్‌పర్సన్ వంగపండు ఉష, విశాఖ జోనల్ సాంస్కృతిక విభాగం ఇన్‌చార్జి మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన జానపద నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అచ్యుత స్కూల్ విద్యార్థినులు కోలాటాలతో సందడి చేశారు.

జన నీరాజనం

నియోజక వర్గంలో నాలుగు మండలాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. క్రీడా మైదానం నిండిపోవడంతో పాటు యలమంచిలి రోడ్డు, పూడిమడక రోడ్డు కిక్కిరిసిపోయింది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ఎక్కడికక్కడ బందోబస్తు నిర్వహించి, పార్కింగ్ స్థలాల్ని కేటాయించారు. సాధారణ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నారు. గోకివాడ జంక్షన్ కొత్తూరు బ్రిడ్జిపై బస్సు యాత్రకు వచ్చిన జనాన్ని డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించారు.



హోరెత్తిన బైక్ ర్యాలీ



విద్యార్థుల కోలాటం

చినుకులతో ఆహ్లాదం

సామాజిక సాధికార యాత్రకు చినుకులు స్వాగతం పలికాయి. సోమవారం సాయంత్రం వాతావరణం చల్లబడి చిన్న పాటి చినుకులు పడ్డాయి. ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా యాత్ర వెంట సాగాయి. అచ్యుతాపురం ప్రభుత్వ కార్యాలయాల జంక్షన్ నుంచి పోలీస్ గ్రౌండ్‌లోని సభా వేదిక వద్దకు అతిథులు చేరుకున్నప్పుడు భారీ స్థాయిలో బాణసంచా కాల్చి సందడి చేశారు. స్వాగత ఫ్లెక్సీలతో అచ్యుతాపురం రహదారులు, కూడళ్లు, భారీ హోర్డింగ్ బోర్డులు రంగులమయంగా మారాయి. బహిరంగ సభకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు రావడంతో మరింత ఆకర్షణ ఏర్పడింది. మహిళలు ఎంతో ఉత్సాహంగా సభలో పాల్గొన్నారు. యువత సీఎం జగన్ ప్లకార్డులతో సందడి చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, సీఈసీ సభ్యుడు శ్రీకాంత్‌రాజు, ముఖ్యనాయకులు డాక్టర్ విష్ణుమూర్తి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చురకలు.. చెణుకులు

సాక్షి, అనకాపల్లి: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రసంగంలో ప్రధాన ప్రతిపక్షానికి చురకలంటించారు. విశాఖను రాజధాని చేస్తే పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చి ఈ ప్రాంతం వృద్ధి చెంది మన భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని, అమరావతిని రాజధాని చేస్తే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మాత్రమే మేలు జరుగుతుందని అన్నప్పుడు చప్పట్లు మిన్నుముట్టాయి. ఈప్రాంత వాసులు విశాఖ రాజధానికి అనుకూలంగా లేరని దుష్ప్రచారం చేస్తున్నవారికి వినిపించేలా.. కనిపించేలా మీ అభిప్రాయం వెల్లడించాలన్నారు. మీకు విశాఖ రాజధాని ఇష్టమా అని ప్రశ్నిస్తే.. అవును అవును అని ప్రజలంతా ఈలలు కేకలు వేస్తూ అంగీకారం తెలిపారు.

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ దివంగత వైఎస్ హయాంలో యలమంచిలిలో స్థాపించిన బ్రాండిక్స్ అపెరల్ పార్కు, ఫార్మాసిటీ వంటి పారిశ్రామిక సంస్థల కారణంగా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉపాధి లభించిందన్నారు.
- ఆనాడు వైఎస్సార్ హయాంలో ఏర్పాటు చేసిన సెజ్ కారణంగా యలమంచిలి నియోజకవర్గంలో కోటి రూపాయలకు తక్కువ ఎక్కడా భూమి దొరకని పరిస్థితి ఉందని యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు అన్నారు. దీనిని బట్టి ఏ స్థాయిలో పురోగతి సాధించామో ఆలోచన చేయాలన్నారు.

ఏపీ సంక్షేమం దేశానికే ఆదర్శం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, పక్కన మంత్రి అమర్‌నాథ్

యలమంచిలి (అనకాపల్లి రూరల్): ప్రజలకు సంక్షేమం అందించడంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజకీయ, చట్ట సభల్లో పదవులు, ఉద్యోగాల కల్పనలో, నవరత్నాల పంపిణీలో అన్నింటా అగ్రతాంబూలం ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. యలమంచిలి నియోజకవర్గంలో సోమవారం ఎమ్మెల్యే కన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా తొలుత క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడారు. గత నాలుగున్నరేళ్లలో సామాజిక న్యాయం, సాధికారత తమ ప్రభుత్వం మాటల్లో కాకుండా చేతల్లో చూపించిందన్నారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయం చూడకుండా అన్ని సామాజిక వర్గాలను అక్కున చేర్చుకుని వారి సంక్షేమంకోసం సీఎం జగన్ ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ రూ.300 కోట్లతో అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. నక్కపల్లి, అచ్యుతాపురం ప్రాంతాలు పారిశ్రామిక హబ్‌లుగా మరింత అభివృద్ధి చెందుతాయన్నారు.

పండగలా బస్సు యాత్రలు

సామాజిక సాధికార బస్సు యాత్రలు పండగలా కొనసాగుతున్నాయని, రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. నవరత్నాల అమలు ద్వారా సీఎం జగన్ పేద ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్నారన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను గతంలో చంద్రబాబునాయుడు ఓటు బ్యాంకుగానే చూశారని, వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో చేసిందేమీ లేదని ఎమ్మెల్యే కన్నబాబు ఆరోపించారు. 139 బీసీ కులాలను గుర్తించిన సీఎంకు బీసీలంతా బ్యాక్ బోన్‌గా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని గవర కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు.



నాగాభరణంతో చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామికి అలంకరణ

ప్రసీద ప్రభో సర్వభూతాధివాసం

కార్తీకమాసం శివకేశవులకు పరమ ప్రీతికరం. కార్తీక సోమవారం పరమ పవిత్రం. దీంతో శివాలయాల ముందు భక్తులు బారులుతీరారు. హర హర మహాదేవ.. శంభో శంకర, ఓం నమఃశివాయ నినాదాలతో ఆలయాలు మార్మోగాయి. రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పాల్గొని భక్తులు ఆధ్యాత్మికానందంలో మునిగి తేలారు. అనకాపల్లిలోని ప్రధాన శైవ క్షేత్రాలు, ఊరూవాడా వెలసిన శివాలయాలు కార్తీక తొలిసోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. పలు చోట్ల స్వామి దర్శనం అనంతరం భక్తులు వనసమారాధన నిర్వహించారు. - చోడవరం



అనకాపల్లి వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

26 నుంచి శ్రీనృసింహ దీక్షలు

సింహాచలం: ఈనెల 26 నుంచి 41 రోజుల శ్రీనృసింహ దీక్షలు, డిసెంబరు 4వ తేదీ నుంచి 32 రోజుల శ్రీనృసింహ దీక్షలు ప్రారంభమవుతాయని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ప్రకటించారు. పై తేదీల్లో సింహగిరిపై శాస్త్రోక్తంగా మాలధారణ ఉంటుందని, దేవస్థానం తరఫు నుంచి స్వామివారి తులసిమాల, ప్రతిమ ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 6న రెండు దీక్షల విరమణ ఉంటుందన్నారు.

గవర సామాజిక వర్గానికి ప్రాధాన్యం

- వైఎస్సార్‌సీపీ పాలనలో సామాజిక న్యాయం
- బురద జల్లే ప్రయత్నం చేస్తే వారే నష్టపోతారు
- దాడి వీరభద్రరావుపై ఎంపీ డాక్టర్ సత్యవతి ధ్వజం



తుమ్మపాల: రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న బీసీ సామాజిక సాధికార బస్సు యాత్ర పండగలా సాగుతోందని, సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి పేద కుటుంబం తరలిరావడంతో సభలు విజయవంతం అవుతున్నాయని ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. తన నివాసంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పాలనలో గవర సామాజిక వర్గానికి ఎంతో ప్రాధాన్యం లభిస్తోందన్నారు. ఆ సామాజిక వర్గానికి చెందిన తనకు ఎంపీగా, బొడ్డేడ ప్రసాద్‌కు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా సీఎం వైఎస్ జగన్ అవకాశమిచ్చారన్నారు. గవర సామాజిక వర్గీయులకే రెండు కార్పొరేటర్ స్థానాలు, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ పదవి కల్పించారన్నారు. గడిచిన 20 ఏళ్లలో వైఎస్సార్‌సీపీ మినహా ఏ పార్టీ కూడా గవర కులస్థులకు అనకాపల్లి పార్లమెంట్ టికెట్ ఇవ్వలేదన్నారు.

సోషల్ మీడియా పోస్టులను ప్రోత్సహించడం తగదు

గవర సామాజిక వర్గానికి సీఎం జగన్ న్యాయం చేయలేదన్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టే వారిని ప్రోత్సహించడం దాడి కుటుంబానికి తగదని ఎంపీ సత్యవతి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ముఖ్యమంత్రిపై, పార్టీపై బురద జల్లే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్త నుంచి రాష్ట్ర మంత్రుల వరకు అందరూ సామాజిక సాధికార బస్సు యాత్రకు ఆహ్వానితులేనని, ప్రత్యేకంగా ఎవరికీ ఎటువంటి ఆహ్వానాలు లేవని ఆమె స్పష్టం చేశారు. గతంలో శాసనమండలి ప్రతిపక్ష నేతగా, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న దాడి వీరభద్రరావుకు సీఎం జగన్ ప్రత్యేకమైన గౌరవం ఇస్తున్నారన్నారు. ఆయన కుమారుడు దాడి రత్నాకర్‌కు ఒకసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని, గడిచిన నాలుగేళ్లలో మరో మూడు నామినేటెడ్ పదవులకు అవకాశాలు ఇచ్చారని గుర్తుచేశారు. తమకు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు దాడి కుటుంబం అంటే గౌరవం ఉందన్నారు. అమర్‌నాథ్ కూడా ఆయన సూచనల మేరకే ఇద్దరు కార్పొరేటర్లకు టికెట్లు ఇచ్చారని గుర్తు చేశారు. దాడి రత్నాకర్ అనేక ప్రభుత్వ కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారని, అనేక అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులకు ఆదేశాలు చేయడం అందరం చూస్తున్నామన్నారు. రాష్ట్ర రాజకీయాలలో సుదీర్ఘ అనుభవం ఉన్న వీరభద్రరావు సంయమనం పాటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాల రూపంలో పేదలకు సీఎం జగన్ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని, రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంటుందన్నారు. రాష్ట్రంలో జగనే మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు.

జిల్లాలో అభివృద్ధి అవకాశాలు అపారం

నీతి ఆయోగ్ గ్రోత్ హబ్ సమావేశంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



నీతి ఆయోగ్ గ్రోత్ హబ్ ప్రాంతీయ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి కొత్త జిల్లాగా ఏర్పడిన అనకాపల్లి అభివృద్ధికి అపారమైన వనరులు ఉన్నాయని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. విశాఖలో నీతి ఆయోగ్ స్పెషల్ సెక్రటరీ అనారాయ్, రాష్ట్ర ప్రణాళికా విభాగం సెక్రటరీ గిరిజాశంకర్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నీతి ఆయోగ్ గ్రోత్ హబ్ ప్రాంతీయ సమావేశంలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో అభివృద్ధి అవకాశాలను వివరించారు. జిల్లాలో 72 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, 24 మండలాలతో 4,002 చ.కి.మీ. విస్తీర్ణంలో 2011 లెక్కల ప్రకారం 17 లక్షలకుపైగా జనాభా ఉందన్నారు. పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి చెందేందుకు ఉన్న అవకాశాలను వివరించారు. ఫార్మా, కెమికల్ ఎస్ఈజెడ్, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ, హెటిరో ఎస్ఈజెడ్, అచ్యుతాపురంలో ఏపీ మల్టీ సెక్టార్ ఎస్ఈజెడ్, అపెరల్ పార్క్ బ్రాండిక్స్ ఎస్ఈజెడ్, పరవాడలో ఎన్టీపీసీ సింహాద్రి, పదివేలకు పైగా రిజిస్టర్డ్ సంస్థలున్న ఎంఎస్ఎంఈల సెక్టార్, మరో ఐదు ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయన్నారు. జిల్లాలో విస్తారమైన భూమి, అపారమైన మానవ వనరులు ఉన్నాయని, పారిశ్రామిక విద్యార్హతలు గల యువత, కార్మికులు ఎక్కువగా ఉన్నారన్నారు. జిల్లాలో ఆహ్లాదకర తీర ప్రాంతాలు, సహజసిద్ధమైన కొండకర్ల ఆవ, వరి, చెరకు పంటలతో పచ్చని పొలాలు, సుప్రసిద్ధ దేవాలయాలు, ఏటికొప్పాక కొయ్య బొమ్మలు, బెల్లం తయారీ కేంద్రాలు పర్యాటకంగా ఆకర్షణీయ ప్రాంతాలన్నారు. కుటీర పరిశ్రమలు, ఆహార పరిశ్రమల అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందన్నారు. సమావేశంలో కోస్తా జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంకల్ప్ యాత్ర విజయవంతం చేయండి

తుమ్మపాల: జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలని డీఆర్వో బి.దయానిధి అధికారులను ఆదేశించారు. ఈ యాత్రకు సంబంధించి వాహనాలు ఆయా గ్రామాలకు వచ్చే తేదీని ముందుగానే తెలియజేస్తారన్నారు. గ్రామ/వార్డు సచివాలయ ప్రత్యేకాధికారి మంజులవాణి మాట్లాడుతూ భారత ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను గురించి అందరికీ అర్థమయ్యే రీతిలో దృశ్య, శ్రవణ ప్రచారం ఉంటుందన్నారు. విజయగాధలు, ప్రకృతి వ్యవసాయం, భూములకు సంబంధించిన లక్షణాలు చెబుతారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, క్విజ్ పోటీలతోపాటు హెల్త్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో డీపీవో శిరీషారాణి, డ్వామా పీడీ సందీప్, జిల్లాలోని తహసీల్దార్లు ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో 9 మందికి గాయాలు

రోలుగుంట: మండలంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. తొమ్మిది మందిపై దాడి చేసి గాయపరిచింది. సోమవారం ఉదయం కె.నాయుడుపాలెంలో జి.బాలరాజు, (58), ఎం.దారమూర్తి(8), జి.కొండనాయుడులపై దాడి చేయగా, గాయపడ్డారు. దాంతో గ్రామస్తులు భయాందోళనతో దాన్ని కర్రలతో బెదిరించి గ్రామం నుంచి తరిమేశారు. అది రోలుగుంట చేరుకుని అక్కడ ఎం.దేవాన్స్(3), ఎం.కార్తీక్(23), ఎల్.గిరీష్(5), ఆర్.సీతారాం(53), బి.సిద్వాన్స్(2), బి.త్రినాథ్(50)లపై దాడి చేసి గాయపరిచింది. వీరంతా రోలుగుంట పీహెచ్‌సీలో చేరడంతో వైద్యులు ధనలక్ష్మి, శ్రావణి రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. ఏఎన్ఎంలు సుజాత, నాగమణి సహాయ సేవలందించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని లారీ డ్రైవర్ దుర్మరణం

కశింకోట: మండలంలోని గొబ్బూరు వద్ద రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందినట్లు ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి సోమవారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... ఆదివారం రాత్రి యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న లారీని మార్గమధ్యంలో గొబ్బూరు వద్ద హోటల్ సమీపంలో నిలిపాడు. అక్కడ రోడ్డు దాటి అవతలి రోడ్డుకు వెళ్తుండగా, ఒడిశాలోని కోరాపుట్ జిల్లా బంగురగూడ గ్రామానికి చెందిన అబీజాని(34)ని అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మృతుని భార్య పద్మజాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

షార్టు సర్క్యూట్‌తో గృహోపకరణాల దగ్ధం

రూ.1.50 లక్షల ఆస్తి నష్టం

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురంలో సోమవారం విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. గ్రామానికి చెందిన యల్లపు కొండలరావు ఇంట్లో ఫ్రిజ్ వద్ద షార్టు సర్క్యూట్ కావడంతో మిగిలిన వస్తువులు దగ్ధమయ్యాయి. రూ.1.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని కొండలరావు కుటుంబీకులు వాపోయారు. షార్టు సర్క్యూట్ సమయంలో వారంతా ఆలయానికి వెళ్లడంతో ప్రాణనష్టం తప్పింది.



అనకాపల్లి కోటవీధిలో భోగలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

హరహర మహాదేవ..

రాంబిల్లి: జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన పంచదార్ల పుణ్యక్షేత్రం కార్తీక తొలి సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. శివనామ స్మరణతో మార్మోగింది. తొలుత పవిత్ర ఆకాశధార వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం క్షేత్ర పాలకుడు ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాశీ విశ్వేశ్వరస్వామి, సహస్ర లింగేశ్వరస్వామి, రాధామాధవ స్వామి, ద్విముఖ కల్యాణ వినాయకున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పుణ్యధారల వద్ద స్నానాలు ఆచరించేందుకు, ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. మండలంలోని దిమిలిలో చారిత్రక నగ్నేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిగాయి.



పంచదార్ల పుణ్యక్షేత్రంలో ఉమా ధర్మలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



పంచదార్ల ఆకాశధార వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

హార్బర్‌లో అలజడి

- చేపల రేవు చరిత్రలో అతి పెద్ద అగ్ని ప్రమాదం
- 'హుద్‌హుద్' తర్వాత మళ్లీ అంతటి భారీ నష్టం
- ప్రమాద తీవ్రతను పెంచిన ఈశాన్య గాలులు
- అర్ధరాత్రి రంగంలోకి దిగిన మత్స్యకార యువకులు
- ఇతర బోట్లు ప్రమాదానికి గురికాకుండా తరలింపు



ఫిషింగ్ హార్బర్‌లో దగ్ధమైన బోట్లు

సాక్షి, విశాఖపట్నం : విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదం తీవ్ర అలజడిని రేపింది. మునుపెన్నడూ లేనివిధంగా ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంతో విశాఖ ఉలిక్కి పడింది. ఐదు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ చేపలరేవులో అతి పెద్ద అగ్ని ప్రమాదం ఇదే. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న వెంటనే నగరంలోని మత్స్యకారులు పిల్లా పాపలతో హార్బర్‌కు పరుగులు తీశారు. అలా సోమవారం మధ్యాహ్నం వరకు వీరు చేపలరేవుకు వస్తూనే ఉన్నారు. మంటల్లో కాలిపోయిన బోట్లను చూసి బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తాము రూ.లక్షల్లో అప్పు చేసి బోట్లు కొనుగోలు చేశామని, ఇప్పుడు మంటల్లో కాలిపోయాయంటూ రోదించారు. ఇలా పెద్ద సంఖ్యలో వచ్చిన మత్స్యకారులతో పాటు అధికారులు, మీడియా ప్రతినిధులతో హార్బర్ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. తొమ్మిదేళ్ల క్రితం సంభవించిన హుద్‌హుద్ తుపానుకు 60 బోట్లు మునిగిపోగా మరో 200కి పైగా బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అగ్ని ప్రమాదంలో 36 బోట్లు పూర్తిగా, తొమ్మిది బోట్లు పాక్షికంగా కాలిపోయాయి. దాదాపు పది బోట్లలో ఉంచిన టన్నుల కొద్దీ చేపలూ దగ్ధమయ్యాయి.

అగ్నికి ఆజ్యం ఇలా..

హార్బర్‌లో అగ్ని ప్రమాదం తీవ్రతరం కావడానికి మరిన్ని ఆజ్యం పోశాయి. లంగరు వేసి ఉన్న అన్ని బోట్లలో వందల నుంచి వేల లీటర్ల డీజిల్ ఉంది. బోట్లను ఫైబర్‌తో తయారు చేస్తారు. బోట్లలో నైలాన్ వలలు ఉంటాయి. అలాగే బోట్లు రాపిడికి గురి కాకుండా ఇరుపక్కల పాత టైర్లను అమరుస్తారు. చేపలవేటకు వెళ్లినప్పుడు బోటులో కలాసీలు వంట చేసుకోవడానికి రెండేసి గ్యాస్ సిలిండర్లు తీసుకెళ్తుంటారు. ఇవి బోట్లలోనే ఉంచుతారు. అగ్ని ప్రమాదం తీవ్రత పెంచడానికి ఇవన్నీ దోహదపడ్డాయి. అంతేకాదు.. ప్రమాదం ఇతర బోట్లకు వేగంగా విస్తరించడానికి గాలులు కూడా తోడయ్యాయి. ప్రస్తుతం ఈశాన్య గాలులు బలంగా వీస్తున్నాయి. హార్బర్‌లోని జీరో జెట్టీ ఆరో నంబర్ షాపు ఎదురుగా లంగరేసిన బాలాజీ బోటులో మొదట అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అక్కడ నుంచి నిమిషాల్లోనే పక్కనున్న బోట్లకు మంటలు వ్యాపించాయి. ఈశాన్య గాలుల దాటికి పశ్చిమ, వాయవ్య దిక్కుల్లో లంగరేసిన బోట్లు కొన్ని ఒకటో నంబర్ జెట్టీలో ఉన్న బోట్ల వైపు వెళ్లిపోయాయి. దీంతో అక్కడున్న పలు బోట్లు అగ్నికి ఆహుతయ్యాయి.

యువకుల సాహసం

అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న కొందరు మత్స్యకార యువకులు పరుగున హార్బర్‌కు చేరుకున్నారు. జెట్టీలకు కట్టిన తాళ్లను కోసివేసి బోట్లకు తాళ్లు కట్టి హార్బర్‌కు దూరంగా తీసుకెళ్లిపోయారు. దీంతో చాలా బోట్లను అగ్ని ప్రమాదం నుంచి కాపాడగలిగారు. లేదంటే మరిన్ని బోట్లు కాలిపోయి ఉండేవి.



దగ్ధమైన బోట్లు, సామగ్రి

ఇన్సూ్యరెన్స్ లేదాయే..

మరోవైపు బోట్లకు ఏళ్ల తరబడి బీమా సదుపాయం లేదు. దీంతో ప్రమాదవశాత్తూ ఈ బోట్లు కాలిపోయినా, మునిగిపోయినా యజమానికి బీమా సొమ్ము రాదు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం వరకు వీటికి ఇన్సూ్యరెన్స్‌కు వీలుండేది. దేశంలో కొంతమంది తప్పుడు క్లెయిమ్‌లకు పాల్పడుతున్నారని తేలడంతో కేంద్రం బోట్లకు బీమా సదుపాయాన్ని ఎత్తివేసింది. అప్పట్నుంచి బోట్లు ఇన్సూ్యరెన్స్‌కు నోచుకోవడం లేదు. బీమా సదుపాయం ఉండి ఉంటే ఈ ప్రమాదంలో కాలిపోయిన బోట్లకు పరిహారం అందేదని మత్స్యకారులు చెబుతున్నారు.

సీఎంకి ధన్యవాదాలు



గత 20 ఏళ్ల నుంచి ఫిషింగ్ హార్బర్‌లో బోటు నడుపుతున్నాను. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నాను. హార్బర్‌లో ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరం. ఆకతాయులు చేసిన పనికి ప్రభుత్వం స్పందించింది. ఊహించిన దాని కన్నా ఎక్కువగానే సహాయం చేస్తోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి సీదిరి అప్పలరాజుకు ధన్యవాదాలు.

– యాగ శ్రీనివాసరావు, బోటు యాజమాని, బోటు నంబర్ 585, ఫిషింగ్ హార్బర్



నిరాశతో మత్స్యకారులు, సొమ్మసిల్లిన మహిళ



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

సామాజిక, ఆర్థిక స్థితిగతులను బట్టి కులగణన

జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో దయానిధి

తుమ్మపాల: కుటుంబాల సామాజిక ఆర్థిక స్థితిగతులను బట్టి కులగణన నిర్వహించాలని డీఆర్వో బి. దయానిధి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి కులగణన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్థికాభివృద్ధి, అణగారిన వ్యక్తుల అనుసరిస్తున్న వృత్తులను బట్టి వారి సమస్యలను తెరపైకి తీసుకురావడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. నిజమైన అర్హత ఉండి సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందని వారికి లబ్ధి చేకూర్చడానికి న్యాయాన్ని అందరికీ వర్తింపజేయాలనే సదుద్దేశంతోనే ప్రభుత్వం కులగణన చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం మండల స్థాయి, బుధవారం గ్రామస్థాయి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ డీడీ కె.రాజేశ్వరి మాట్లాడుతూ కులగణన సర్వే నిర్వహణపై విధి విధానాలను పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ప్రస్తుతం జారీ చేస్తున్న బీసీ కుల ధ్రువపత్రాలపై ఈ సర్వే ప్రభావం ఉండదని, అందరికీ తెలియజేయాలని డ్వామా పీడీ ఇ. సందీప్ సూచించారు. ఆయా కులాల పరిస్థితులను బట్టి వారి అభివృద్ధికి చేపట్టాల్సిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు రూపొందించేందుకు మాత్రమేనని చెప్పారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దగ్గరి పోలికలు ఉన్న సామాజిక వర్గాలను ఉదహరిస్తూ విశదీకరించారు. గ్రామ/వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి మంజులవాణి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించడానికే 'ఆడుదాం ఆంధ్ర'

జెడ్పీ సీఈవో పోలినాయుడు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో పోలినాయుడు

మాడుగుల: విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించడానికే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ అంబాసిడర్లు, పీఈటీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 21వ తేదీ నుంచి సచివాలయంలో నమోదు చేయించుకోవాలన్నారు. వచ్చే నెల 21 నుంచి జనవరి 5వ తేదీ వరకు మండల స్థాయి, 6 నుంచి 11 వరకు నియోజకవర్గ స్థాయి, 12 నుంచి 23వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులతో ఉపాధి హామీ పనులు, జగనన్న ఇల్లు, గడపగడపకు హామీలు పనులు, ఇంటింటికీ కుళాయిలు, పెండింగ్ పనులపై సమీక్షించారు. వెంటనే పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో మీనాకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరసింగరావు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి–యలమంచిలి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి(50) మృతదేహాన్ని గుర్తించామని తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ సోమవారం తెలిపారు. ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొనడం వల్ల మృతి చెందాడన్నారు. ఎత్తు 5.9 అడుగులు ఉండి, నలుపు రంగు ప్యాంటు, ఫుల్ హాండ్స్ షర్టు, లోపల వైట్ కలర్ బనియన్, శరీరంపై జంధ్యం ధరించి ఉన్నాడన్నారు. ఇవి తప్ప ఎటువంటి ఆధారాలు లేనందున మృతదేహాన్ని కుటుంబ సభ్యులు, బంధువుల కోసం తుని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచామన్నారు. ఆచూకీ కోసం తమను సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న తుని రైల్వే పోలీసులు

'డయల్ యువర్ డీపీటీవో'కు 9 సమస్యలు



ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా అధికారి పద్మావతి

అనకాపల్లి టౌన్: స్థానిక ప్రజా రవాణా శాఖ కార్యాలయం (ఆర్టీసీ)లో సోమవారం జరిగిన డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చిందని ఆ శాఖ జిల్లా అధికారి కె.పద్మావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి తొమ్మిది మంది ఫోన్ చేసి సలహాలు, సూచనలు అందజేశారన్నారు. అనకాపల్లి– విజయనగరం మార్గంలో రెండు లేదా మూడు బస్సులు నడపాలని, సంస్థకు ఆదాయం పెరుగుతుందని ప్రయాణికుడు శర్మ కోరాడన్నాడు. మరో ప్రయాణికుడు రౌతు శ్రీనివాస్ ఫోన్ చేసి విశాఖపట్నం నుంచి వెళ్లే బస్సులు లంకెలపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద ఫ్రీ లెఫ్ట్‌కి అడ్డంగా నిలపడంతో ఫార్మాసిటీ వైపు వెళ్లే ద్విచక్ర వాహనదారుల ఇబ్బందులను తమ దృష్టికి తెచ్చాడన్నారు. మరో ఏడుగురు పలు సమస్యలను వివరించారన్నారు.

గడువులోగా అర్జీలకు పరిష్కారం

- జాయింట్ కలెక్టరు జాహ్నవి
- స్పందనకు 425 అర్జీలు



స్పందన అర్జీలను స్వీకరిస్తున్న జేసీ జాహ్నవి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల: స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను మరింత వేగంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామస్థాయిలో సమస్యలను వీలైనంత వరకు మండలాల స్థాయిలో పరిష్కరించాలని సూచించారు. తిరస్కరించిన వాటిలో అర్జీదారులకు కారణాలను స్పష్టంగా వివరించాలన్నారు. ఈ వారం స్పందనకు 425 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూ సమస్యలు, రేషన్ కార్డులు, తదితరవి ఉన్నాయి. వీటిని జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, ఎస్.డి.సి.లు కె.రమామణి, ఎ. మహేష్, డ్వామా పీడీ ఇ.సందీప్ స్వీకరించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అక్రమణను అడ్డుకోవాలి...

మాడుగుల మండలం పోతనపూడి అగ్రహారంలో సర్వే నంబరు 59లో 4.80 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించి లేఅవుట్ వేసి చేస్తున్న విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని అనకాపల్లి పట్టణానికి చెందిన పప్పల వెంకట గణేష్ స్పందనలో ఫిర్యాదు చేశాడు. సదరు సర్వే నంబర్‌లో సచివాలయ భవనాలు ఉన్నాయని, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై గ్రామానికి చెందిన ఓ వ్యక్తి విక్రయాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణంలో మట్టి, గ్రావెల్‌ను అక్కడ ఆక్రమించిన భూమిలోకి తరలించి సొమ్ము చేసుకుంటున్నాడని అందులో పేర్కొన్నారు. సదరు భూమిలో విలువైన వృక్షాలను నరికివేసి విక్రయించేశారని, అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫీల్డు అసిస్టెంట్‌ను తొలగించాలి....

దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో ఎటువంటి అర్హత లేనటువంటి వ్యక్తిని ఫీల్డు అసిస్టెంట్‌గా నియమించడంపై సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి స్పందనలో ఫిర్యాదు చేశారు. గతంలో పనిచేస్తున్న బాణం విజయలక్ష్మిని తొలగించి నిబంధనలకు విరుద్ధంగా మరో వ్యక్తిని నియమించడం అన్యాయమని, వెంటనే ఆమెను విధుల్లో చేర్చుకోవాలని కోరారు.

అనకాపల్లి టౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 40 అర్జీలు వచ్చాయి. ఈ మేరకు ఎస్పీ కేవీ మురళీకృష్ణ అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ చట్టపరిధిలో వాటిపై దిగువ స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ వంటివాటిపై అర్జీలు అధికంగా వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో క్రైం అడిషనల్ ఎస్పీ పి.సత్యనారాయణరావు, ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జిల్లాలో సముద్ర తీరాల వద్ద పటిష్ట బందోబస్తు...

కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని సముద్ర, నదులకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీస్ శాఖ హెచ్చరికలు, సూచనలు పాటిస్తూ పవిత్ర స్నానాలు ఆచరించాలని భక్తులకు సూచించారు.

విశాఖ చేరుకున్న భారత్,ఆస్ట్రేలియా టీ-20 జట్లు

విశాఖ స్పోర్ట్స్ : భారత్–ఆస్ట్రేలియా మధ్య ఈనెల 23 నుంచి టీ–20 మ్యాచ్ జరగనుంది. తొలి మ్యాచ్‌కు విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదిక కానుంది. ఇరు జట్లు విశాఖ చేరుకున్నాయి. రాడిసన్ బ్లూ హోటల్‌లో భారత్ ఆటగాళ్లు సేద తీరగా... ఆసీస్ ఆటగాళ్లు సోమవారం వైఎస్సార్ స్టేడియంలో ప్రాక్టీస్ చేశారు. ఆసియన్ గేమ్స్‌లో ఆడిన క్రీడకారులే ఎక్కువ మంది భారత్ తరుపున ఆడనున్నారు.

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాల పంట



విద్యార్థి వినయ్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న శ్రీనివాసరావు



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



పతకాలు సాధించిన క్రీడాకారులతో వెంకటరాము

అనకాపల్లి టౌన్: రాష్ట్ర స్థాయి పదో సబ్ జూనియర్, జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అనకాపల్లి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం గుండివిల్లిపేటలో ఈ పోటీలు జరిగాయి. ఇందులో 81 కేజీల మహిళల విభాగంలో ఎ.రేవతి స్నాచ్ 81 కిలోలు, క్లీన్ అండ్ జర్క్ 91 కిలోల బరువు నెత్తి సబ్ జూనియర్ విభాగంలో బంగారు పతకం, సీనియర్ విభాగంలో కాంస్య పతకాలు సాధించింది. పురుషుల 89 కేజీల విభాగంలో ఎస్.కె.లాల్‌బషీర్ స్నాచ్ 132 కేజీలు, క్లీన్ అండ్ జర్క్ 158 కేజీల బరువునెత్తి జూనియర్ విభాగంలో కాంస్య పతకం, సీనియర్ విభాగంలో రజత పతకాన్ని సాధించాడు. వీరితోపాటు మరో ముగ్గురు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. వీరిని సోమవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి గుమ్మాల వెంకటరాము, తదితరులు అభినందించారు.

అనకాపల్లి టౌన్: ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు బీటెక్ ద్వితీయ సంవత్సరం ఈఈఈ విద్యార్థి ఎ.వినయ్ అర్హత సాధించడం అభినందనీయమని దైట్ కళాశాల పీడీ బీసీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కళాశాల ఆవరణలో సోమవారం ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూలో ఈ నెల 16, 17 తేదీల్లో జరిగిన పోటీల్లో బంగారు పతకం సాధించి రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో వచ్చే నెల 8 నుంచి 12వ తేదీ వరకు జరిగే అంతర్ వర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు అర్హత సాధించాడన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, డీన్ అకాడమిక్స్ కో ఆర్డినేటర్ కృష్ణనాగ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఇంటర్ విద్యార్థిని

నర్సీపట్నం: జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు రిషి జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థిని జి.పుష్పలత ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో గుంటూరులో జరిగిన ఈ పోటీల్లో ఆమె పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్ కోన సతీష్, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

కశింకోట: కశింకోట డీపీఎన్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఎం.ఆర్.వి అప్పారావు సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లిలో ఈ పోటీలు ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించగా అండర్ – 17 విభాగంలో విద్యార్థులు కె. దిలీప్, టి. శ్యామల రాణించి ఎంపికయ్యారన్నారు. వీరు త్వరలో రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని పీఈటీ వి. ప్రభాకరరావు తెలిపారు. వీరిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

క్లుప్తంగా

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

అనకాపల్లిటౌన్ : ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం మంగళవారం పట్టణంలో సచివాలయం-9 భీముని గుమ్మంలోను, మండలంలో మార్టూరు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబులు ఓ ప్రకటనలో వేర్వేరుగా పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయం పరిధిలో అర్హులైన లబ్ధిదారుల డిస్‌ప్లేబోర్డు, జెండా ఆవిష్కరణ, ఇంటింటికి వెళ్లి టీడీపీ పాలన, నేటి పాలనపై బ్రోచర్ పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాలని వారు కోరారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



కశింకోటలో ట్రాక్టర్‌పై వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

కశింకోట : కశింకోటలోని కోనేరు వద్ద వెలసి ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామి వార్షిక కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మల ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌పై గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటాల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం ఆలయంలో స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశాఖకు చెందిన కడియం శ్రీనివాస్ దంపతులు కల్యాణాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

కులగణనలో నమోదు చేసుకోండి



లక్ష్మీదేవిపేటలో పర్యటిస్తున్న సంఘ నేతలు

అనకాపల్లిటౌన్: ప్రభుత్వం తలపెట్టిన కుల గణన కార్యక్రమంలో తూర్పు కాపులందరూ నమోదు చేసుకోవాలని సంఘ అధ్యక్షుడు పలకా రాము కోరారు. పట్టణంలో గాంధీనగరం అజయ్యకాలనీ, లక్ష్మీదేవిపేట, కోట్నివీధుల్లో కాపుసంఘ సభ్యులు సోమవారం పర్యటించారు. కార్యక్రమంలో సంఘ నేతలు పాల్గొన్నారు.

డివిజన్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి



మాట్లాడుతున్న యలమంచిలి ఉప విద్యాశాఖ అధికారి పెన్నాడ అప్పారావు

కశింకోట: నిబంధనలకు అనుగుణంగా బాధ్య తాయుతంగా విధులను నిర్వర్తించి డివిజన్‌ను ప్రథమ స్థానంలో నిలపడానికి దోహదపడాలని యలమంచిలి ఉప విద్యాశాఖ అధికారి పెన్నాడ అప్పారావు కోరారు. కశింకోటలోని డీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు 12 మండలాలకు చెందిన ఎంఈవో-2, ప్రధానోపాధ్యాయులకు సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగింపు సభలో మాట్లాడారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, హెచ్ఎం అప్పారావు, హెచ్ఎంల సంఘం ప్రధాన కార్యదర్శి రవీంద్రబాబు, ప్రతినిధులు పట్నాయక్, శ్రీలక్ష్మి, శేషగిరిరావు, ఎ.శ్రీధర్‌రెడ్డి, ఎంఈవో చిట్టిబాబు పాల్గొన్నారు.

లేగ దూడల పెంపకంతో రైతుల ఆర్థిక పరిపుష్టి

కశింకోట: లేగ దూడల పెంపకంతో రైతులు ఆర్థిక పరిపుష్టి సాధించనున్నట్లు డీఎల్‌డీఏ నిర్వహణాధికారి డాక్టర్ బి. రామ్మోహనరావు తెలిపారు. వెదురుపర్తిలో లేగ దూడల అందాల పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీలను సర్పంచ్ శనివాడ అరుణతో కలిసి ప్రారంభించారు. ఈ పోటీలో 44 లేగ దూడలు పాల్గొన్నాయి. డిప్యూటీ డైరెక్టర్ ఎస్. కరుణాకరరావు మాట్లాడుతూ లేగ దూడల పెంపకం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. అనంతరం లేగ దూడల పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్న రైతులు శనివాడ వెంకటరమణ, దమ్ము అప్పారావు, సేనాపతి రాములకు బహుమతులు ప్రదానం చేశారు.



నా పేరు బత్తిన గజ్జాలమ్మ. మాది ఈ ఊరే(జి భీమవరం). నా వయసు దగ్గర దగ్గర 55 ఏళ్లుంటాది. నా సిన్నప్పుడు రోగమొస్తే ఆకు పసర్లు, లేహ్యం తినిపించేవాళ్లు. తర్వాత్తర్వాత సంచి డాట్టర్లు ఊళ్లోకొచ్చేవాళ్లు. ఆళ్లతో కూడా తగ్గకపోతే టౌనుకెళ్లేవాళ్లం. అక్కడ తెల్లారగట్లే సేరుకుంటే.. మద్దేనానికెప్పుడో డాట్టరొచ్చేవోడు. అందరికీ ఒకేలాటి మందుబిల్లలిచ్చి ఏసుకోమనేవోలు. ఇపుడా ఇబ్బందే లేదు. జగన్‌బాబు సీఎం అయ్యాక మా ఊళ్లోకే డాట్టరు, మందుల బస్సు(104) వత్తాంది. రత్త పరీచ్చలు చేసి, రకరకాల మందులిత్తన్నారు. టౌనుకెళ్లక్కర్లేకుండానే రోగం కుదుటబడుతోంది. జగన్‌బాబు సల్లగుండాలి.



జి.భీమవరంలో నెలకొల్పిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్



పేదల ఆరోగ్యం.. మరింత భద్రం

విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో మెరుగైన వైద్య సేవలు

నెలలో రెండుసార్లు ఫ్యామిలీ డాక్టర్, 104 వాహనం

హెల్త్ క్లినిక్ ద్వారా
- **12** రకాల వైద్య సేవలు
- **14** రకాల వైద్య పరీక్షలు
- **105** రకాల మందులు
- **67** రకాల బేసిక్ మెడికల్ ఎక్విప్‌మెంట్‌లు అందుబాటులోఉన్నాయి

నాడు ఏ చిన్న అనారోగ్యం వచ్చినా.. సంచి వైద్యులే దిక్కు. వారికి తెలిసిన వైద్యం చేసేవారు. తలరాత బాగుంటే సరి.. లేకుంటే ఇక అంతే. రోగం పీకల మీదికొస్తే పట్టణంలోని పెద్దాస్పత్రే దిక్కు. అక్కడా వైద్యం ఉంటే మందులుండని స్థితి. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే ఆస్తులు అమ్ముకోవాల్సిందే..!

నేడు ప్రతి గ్రామ పంచాయతీలో ఓ వైఎస్సార్ హెల్త్ క్లినిక్. ప్రతి ఊరికీ ఫ్యామిలీ డాక్టర్. ప్రజల ఆరోగ్యానికి సీఎం జగనన్న ఇచ్చిన భరోసా ఇది. అనారోగ్యం వచ్చాక కాదు.. ముందుగానే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్యసేవలు, కావాల్సిన మందులు అందించి ఆరోగ్య భద్రత పెంచుతున్నారు.

కశింకోట: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలి. అదే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రతిష్టాత్మకంగా నెలకొల్పారు. ఈ హెల్త్ క్లినిక్‌లతో గ్రామీణ ప్రజలకు ఆరోగ్య భద్రత పెరిగింది. మండలంలో సచివాలయాల వారీగా హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. అద్దె భవనాల్లో నడుస్తున్న వాటికి సొంత భవనాలు నిర్మించారు. వీటిలో వైద్య సేవలు కూడా ప్రారంభమయ్యాయి.

మండలంలో ఆరోగ్య ధీమా

మండలంలో 18 వైఎస్సార్ గ్రామీణ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ప్రతి సచివాలయ పరిధిలో ఒక్కొక్కటి చొప్పున 2021లో ఏర్పాటు చేశారు. మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) పరిధిలో ఉగ్గినపాలెం, జి.భీమవరం, తాళ్లపాలెం-1, అచ్చెర్ల, ఈ.చౌడువాడ, తీడ, చింతలపాలెం, ఏఎస్ పేట, నూతలగుంటపాలెం, నరసింగబిల్లిలోను, కశింకోట పీహెచ్‌సీ పరిధి తేగాడ, కొత్తపల్లి, వెదురుపర్తి, బయ్యవరం, కశింకోట-1, 2, 3 సచివాలయాల్లో హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. అద్దె భవనంలో నడుస్తున్న వాటిలో ఉగ్గినపాలెం క్లినిక్‌కు మొదటిగా రూ.20.80 లక్షలతో సొంత భవనాన్ని నిర్మించారు. గత నాలుగు మాసాలుగా ఈ భవనంలోనే వైద్య సేవలందిస్తున్నారు. జి.భీమవరంలో కూడా క్లినిక్‌కు సొంత భవనాన్ని నిర్మించారు. తేగాడలో తాజాగా సొంత భవనాన్ని నిర్మించి, ప్రారంభించారు. హెల్త్ క్లినిక్‌లో సీహెచ్‌వో గది, హాల్, రక్తపరీక్షలు నిర్వహించేందుకు వీలుగా ల్యాబ్ నిర్మించారు.



క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న సీహెచ్‌వో తరంగిణి



క్లినిక్‌లో రక్త పరీక్షల నిర్వహణ ల్యాబ్ రూం

విస్తరించిన వైద్య సేవలు

ప్రతి హెల్త్ క్లినిక్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ సేవలు అందుతున్నాయి. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో) స్వయంగా రోగుల్ని పరీక్షించి, వైద్యం అందిస్తున్నారు. రోజూ ఒక్కో క్లినిక్‌కు 20 నుంచి 40 మంది రోగులు వచ్చి, వైద్యం పొందుతున్నారు. వీరిలో బీపీ, సుగర్, శరీర నొప్పులు, మోకాళ్ల నొప్పులు తదితర సమస్యలతో బాధపడుతున్న వారే ఎక్కువ. ఒక్కో గ్రామంలో నెలకు రెండుసార్లు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య నిపుణులు వచ్చి, మంచాన పడ్డ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. 104 సంచార వైద్యశాలతో 30 రకాల వైద్య ఆరోగ్య సేవలు, అవసరమైన మందులతో ప్రజారోగ్యానికి భరోసానిస్తున్నారు.



గర్భిణిని తనిఖీలు చేస్తున్న సీహెచ్‌వో లక్ష్మీప్రసన్న

తాళ్లపాలెం వెళ్లేవాళ్లం



గతంలో వైద్య సేవల కోసం తాళ్లపాలెం వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా గ్రామంలోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఏర్పాటయింది. అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇంత గొప్పగా ఆస్పత్రి కట్టిస్తారనుకోలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు డాక్టర్, ఏఎన్ఎంలు ఉంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

– తురకలపూడి అప్పారావు, జి.భీమవరం

మందులన్నీ ఆస్పత్రిలోనే..



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌తో ఆరోగ్యంపై ధీమా వచ్చింది. వైద్య సేవల కోసం దూరాబారం వెళ్లాల్సిన అగత్యం తప్పింది. ఒక మూలన ఉన్న సచివాలయంలో హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశారు. మొదటిగా మా ఊర్లోనే సొంత భవనాన్ని నిర్మించారు. వైద్యంతోపాటు, మందులన్నీ ఉచితంగానే ఇస్తున్నారు. బయట కొనక్కర్లేదు. ఎంతో ఆనందంగా ఉంది.

– గాలి శ్రీను, ఉగ్గినపాలెం.

సత్వర వైద్య సేవలు

నెలకు కనీసం 400 మంది వరకు ఓపీ నమోదవుతోంది. గర్భిణులు, పిల్లలు, పెద్దలు, ఇతరులు అన్ని రకాల వైద్య ఆరోగ్య సేవలు పొందుతున్నారు. నెలకు రెండుసార్లు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో తాళ్లపాలెం పీహెచ్‌సీ నుంచి వైద్య నిపుణులు వచ్చి సేవలందిస్తున్నారు. అత్యవసర వైద్యం అవసరమైనపుడు స్వయంగా వచ్చి వైద్య సేవలందిస్తున్నారు.

– ఎం.తరంగిణి, లక్ష్మీ ప్రసన్న, సీహెచ్‌వోలు, జి.భీమవరం, ఉగ్గినపాలెం.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



తాళ్లపాలెం గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న లగిశెట్టి భవాని

కశింకోట : కశింకోట, తాళ్లపాలెం శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో కశింకోట సర్పంచ్ మంత్రి జయరజని, ఎంపీటీసీ సభ్యులు యల్లపు నూకరత్నం, లగిశెట్టి భవాని, రిటైర్డు ఎంఈవో నంబా రమణ, తాళ్లపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.గ్రేసి, పాఠశాల గ్రంథాలయ అధికారి ఎం. భారతి, గ్రంథాలయాల అధికారులు కె.వరలక్ష్మి, కె.జగన్నాథం పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

అనకాపల్లిటౌన్: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంచే దేవాలయాలని దిశపోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.రాములమ్మ అన్నారు. స్థానిక శాఖవీధి శాఖాగ్రంథాలయంలో 56వ జాతీయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఖాళీ సమయాల్లో గ్రంథాలయాలను సందర్శించి మహనీయుల జీవిత చరిత్రల పుస్తకాలను చదివి వారి ఆశయ సాధనకు కృషి చేయాలని ఆమె కోరారు. గ్రంథాలయం అధికారి కె.శ్రీనివాసరావు, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం, గ్రంథాలయ సభ్యులు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథ్, డాక్టర్ ఇమ్మిడిశెట్టి చక్రపాణి, సాయిబాబా పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

- భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు
- పరమశివుడికి విశేష పూజలు, అభిషేకాలు
- భక్తుల రద్దీతో శివాలయాలు కిటకిట



కశింకోటలోని శివాలయంలో స్వామికి అభిషేకాలు



సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో..



సాధువుల గుడిలో..

అనకాపల్లిటౌన్: శివాలయాలు హరహర మహాదేవ నామస్మరణతో సోమవారం మార్మోగాయి. కార్తీక మాసం మొదటి సోమవారం పురస్కరించుకుని ఆలయాల్లో తెల్లవారుజాము 4 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ స్వామివారికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి, మెయిన్‌రోడ్డులో సిద్ధిలింగేశ్వరస్వామి, చిన్నరాజుపేటలో సాంబశివుని ఆలయం, గవరపాలెం కోటవీధిలో భోగలింగేశ్వర స్వామి ఆలయం, శారదానది ఒడ్డున, గాంధీనగరం ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాలు, కూరగాయల మార్కెట్ వద్ద సాధువుల ఆలయం, అక్కిరెడ్డిపాలెం, శీరంశెట్టివానిపాలెం, మామిడిపాలెం, బవులవాడ, సీతానగరం, గోపాలపురం, మారేడుపూడి, తగరంపూడి గ్రామాల్లో గల శివాలయాల్లో ఓం నమశ్శివాయ నామ సంకీర్తన పలువురు భక్తులను ఆకట్టుకుంది. కొబ్బరికాయలు, వీభూది, నేరేడు, పాలు, వివిధ రకాలైన పండ్ల రసాలతో శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లో ధ్వజస్తంభాల వద్ద మహిళలు దీపాలు వెలిగించారు.

కశింకోట : పురాతన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయాన్ని భక్తులు సందర్శించి స్వామికి అభిషేకాలు నిర్వహించారు.అర్చకులు చిదంబరం, కృష్ణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివలింగాన్ని పూలమాలతో అందంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. కస్పావీధి సాంబశివుని ఆలయంలో అర్చకుడు వేయిదళంల ప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు జరిగాయి. గవరపేటలోని వేంకటేశ్వస్వామి ఆలయం, లక్ష్మీనృసింహస్వామి ఆలయం, ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి.

నవరత్న ప్రదాతకే మళ్లీ పట్టం కడదాం



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్ : రాష్ట్రంలో పేదలకు గూడు కల్పించిన ఏకైక వ్యక్తిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. సచివాలయం 6 పరిధిలో స్థానిక మిరియాల కాలనీ, ఏఎంసీ కాలనీలో సోమవారం వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ అధ్యక్షతన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీలు ఊళ్లను తలపించేలా ఉన్నాయన్నారు. నవరత్నాల ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలు అందించి పేదలకు భరోసా కల్పించిన జగనే అని అన్నారు. సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రజలకు ఈరోజు ఎన్నో సేవలందుతున్నాయని చెప్పారు. జాజుల రమేష్ మాట్లాడుతూ విద్య, వైద్యంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, జాజుల రమేష్, కొణతాల మురళీకృష్ణ నివాళులర్పించారు. పార్టీ జెండాను కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి ఆవిష్కరించారు. జీవీఎంసీ ఏఈడీవో దొర, మాజీ కౌన్సిలర్ మధు, సచివాలయ కన్వీనర్ దుర్గ, బండి ఆనంద్, బుద్ద భాస్కర్, కటారి నూకరాజు, నడుపూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్.ఎస్.అగ్రహారంలో..

గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా జరుగుతున్న అభివృద్ధి ద్వారా రాష్ట్ర ప్రజలు, రైతుల్లో గుండెల్లో జగన్ సుస్థిర స్థానం సంపాదించుకున్నారని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గడిచిన నాలుగున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల ముందుకెళ్లి ధైర్యంగా ఓటు అడుగుతామన్నారు. గ్రామ సచివాలయ పరిధిలో ఇప్పటి వరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఎంత ఖర్చు చేశారో బోర్డు ద్వారా వివరించారు. మెయిన్‌రోడ్డు వద్ద పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. గ్రామస్తులకు బ్రోచర్లు అందించి నింపించి, అక్కడే పల్లెనిద్ర చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గోవింద, సర్పంచ్ గోవిందరావు, పార్టీ నాయకులు కోరుకొండ అర్జునరావు, మద్దాల రమణ, ఎంపీటీసీ అచ్చియ్యమ్మ, సచివాలయ కన్వీనర్లు బంటు శ్రీనివాసరావు, ఎంపీడీవో నర్సింహారావు, ఈవోపీఆర్డీ ధర్మారావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులకు 25న భూమిపూజ

కశింకోట : కశింకోటలోని నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద నూతనంగా నిర్మించనున్న కల్యాణ మండపం, ప్రహరీ నిర్మించడానికి ఈ నెల 25న భూమి పూజ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. సోమవారం నూకాంబిక అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో వాటి నిర్మిత ప్రాంతాన్ని ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులుతో కలిసి పరిశీలించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట



స్వామి కల్యాణ విగ్రహాలను దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట : వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి పంచలోహ విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని కశింకోటలో సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ వ్యవస్థాపకుడు ఎస్.వి.ఎస్.ఎన్ రెడ్డి (శ్రీను రెడ్డి), అరుణమ్మ దంపతులు ప్రతిష్టాపన చేశారు. అనంతరం కల్యాణోత్సవాన్ని ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి ఆలయ అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రామచరణాచార్యులు నిర్వహించారు. విగ్రహ దాతలు పువ్వల శ్రీనివాసరావు, రేవతి దంపతులు, ఆలయ అర్చకుడు ఆరవెల్లి వెంకట గోపాలకృష్ణమూర్తి, ఆలయ కమిటీ ప్రతినిధి కె.రాజారావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



తేగాడ సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

కశింకోట : రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ ప్రగతి పథం వైపు తీసుకు వెళ్లారని వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు అన్నారు. తేగాడ సచివాలయం వద్ద సోమవారం సచివాలయ పరిధిలో నిర్వహించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన బోర్డును ప్రారంభించారు. మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి ప్రజలు సహకారం అందించాలన్నారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, పార్టీ మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు మంగతాయారు, పేరంటాలపాలెం ఉప సర్పంచ్ వజ్రం శ్రీను, పార్టీ స్థానిక నాయకుడు నీటిపల్లి దివాకర్, అధికారులు, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.